
# ఆత్మహత్యకో ఆల్టర్‌నేటివ్!



పిడపర్తి వేంకట సుబ్రమణ్యం




"రా మారావుగారూ!" అడిగాడా అవతలి వ్యక్తి.

"స్పీకింగ్!" అన్నాను కళ్లజోడు తీసి టేబుల్ మీద పెట్టి, కళ్లు నలుపుకుని చేతిలో పెన్ను పక్కన పెట్టి కుర్చీకి జారగిల్లాను.

"నేను, సార్! సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, పంజాగుట్ట మాధవ్‌రెడ్డిని!"

"చెప్పండి, రెడ్డిగారూ!" అంటూ అలవాటు ప్రకారం టైము చూశాను. పదకొండు గంటల ముప్పై ఐదు. మరో ఇరవై నిముషాల్లో అర్ధరాత్రి అవుతుంది.

"మీకో కేసు పంపుతున్నాను. నిజానికి అరెస్టు చేద్దామనుకున్నాను. కానీ మనిషి ఎడ్యుకేటెడ్‌గానూ, కల్చర్డ్‌గానూ కనిపించడంతో మీరు మాట్లాడి చూస్తే సమస్య అర్థమవుతుందనీ, మీకు కేసు స్టడీకి పనికివస్తాడనీ అనుకుంటున్నాను!" అన్నాడు రెడ్డి.

కుర్చీలోంచి నిటారుగా కూర్చున్నాను.

"వెంటనే పంపిస్తారా, రేపొద్దున్నా?"

"ఇప్పుడే! టాంక్‌బండ్ దగ్గర రైలింగ్ దాటే ప్రయత్నంలో ఉండగా మా బీట్ కానిస్టేబుల్ పట్టుకున్నాడు!"

"పంపించండి. పేరేమిటి?" అడిగాను.

"రాజగోపాలరావు. వయస్సు నలభైరెండు ఉంటాయి. మిగతా విషయాలు మీరే

చూస్తారు!" అన్నాడు.

"సరే, పంపించండి!" అని ఫోను పెట్టేశాను.

కళ్లజోడు తీసి తుడిచి బల్లమీద ఉంచాను. పక్కనున్న ఫోర్‌స్క్వేర్ పాకెట్ నుంచి ఒక సిగరెట్టు తీసి వెలిగించి రెండు దమ్ములు లాగాను. ఈమధ్య ఆత్మహత్యలు పెరిగాయి. అందులో టాంక్‌బండ్‌మీద నుంచి హుసేన్ సాగర్‌లోకి దూకి మునిగి చావటం మరీ సులువు, ఈజీ అయిందేమో పోలీసులు రాత్రి అక్కడ ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేశారు. కారణం, ఒకసారి దుమికాక, సగంలో తన నిర్ణయం మార్చుకున్నా ఫలితం లేని పద్ధతి అవటం వలన అదో ఆత్మహత్యల కూడలిలా అయింది. అదే కాకుండా, రైలుకోసం ఆగడం, అప్పుడు ముందుకు ఉరకడం, ముందే పడుకుంటే రైలాపి, లేపేయటం, ఉరకడంలో అటూ-ఇటూ అయితే ఏ చక్రానికో, రాడ్‌కో తగిలి తునాతునకలై, నాలుగైదు గంటలు చచ్చేలా అవస్థపడి చావటం ... ఇవన్నీ కాకుండా ఉరి ఒక పెద్ద సమస్య అయిపోయింది సిటీలో. సీలింగ్ మరీ చిన్నదైంది. అంటించుకు చావడమంత దరిద్రం మరోటి లేదంటాను. చచ్చేవరకూ అరుస్తూ, గోలపెడుతూ, పళ్లు బిగించుకు కూర్చోవాలి. ఖర్మవశాత్తూ మధ్యలో ఎవడైనా ఆపేడో వాడు చావకుండా చచ్చినట్లే అదీ ఏ గాంధీ హాస్పటల్లో, ఉస్మానియా అయితే పూర్తిగా చచ్చినట్లే, బతికిండగానే.

దగ్గరదగ్గర సంవత్సరమవుతోంది ఎస్.పి. మాధవ్‌రెడ్డితో పరిచయం అయి. వెల్‌కమ్ హోటల్‌లో కాన్ఫరెన్స్‌లో జరిగిన సంభాషణల్లో, నా ఇంట్రస్టు, సబ్జెక్టు ఆయనకి నచ్చాయి. నా సైకియాట్రిస్టు నాలెడ్జి, నా సైంటిఫిక్ అప్రోచ్ ఈ ఆత్మహత్యలను నిరోధించటానికి ఉపయోగపడతాయని నేను ఆయనకి అర్థమయ్యేలా వివరించగలిగాను. ప్రస్తుతం ఉన్నవి, పాటించే పద్ధతులు, విధానాలు వాళ్లని మార్చేందుకు అంతగా ఉపయోగపడవని నా అభిప్రాయం. కస్టడీలోకి తీసుకుని, అతని స్వాతంత్ర్యానికి అడ్డుకట్ట వేసి, ఇన్ హ్యూమన్ పరిస్థితులలో జైళ్లల్లో వేస్తే మనిషి విపరీతంగా మారటానికి, బుద్ధి వికృతంగా తిరగటానికీ సావకాశాలు ఎక్కువని నా అభిప్రాయం. పది నిముషాల్లో ఇంటిముందు మారుతీ జీప్సీ ఆగింది. ఇద్దరు కానిస్టేబుళ్లు ఒక ఆజానుబాహుడ్ని లోపలికి తీసుకొస్తున్నారు.

"ఈయన పేరు రాజగోపాలరావుగారు" అన్నాడు ఒక పోలీసు.

లేచి నుంచుని చేయి కరచాలనం కోసం చాపాను.

అతను పూర్తిగా ఖిన్నుడై ఉన్నాడు. తలవంచుకుని, అస్థిమితంగా చూస్తున్నాడు.

"కూర్చోండి రాజగోపాలరావుగారూ!" అని కుర్చీ చూపించి కూర్చోమన్నాను. ఇద్దరు పోలీసులూ బయటకెళ్లిపోయారు.

రాత్రి పన్నెండయింది. డిసెంబరు నెల మొదటివారం అవటం వలన చలి మెల్లగా అందుకుంటోంది. చేతులు రెండూ రాపిడి చేసుకుంటూ ఆయనకేసి చూసి నవ్వాను.

"చెప్పండి, రాజగోపాల్! ... అలా పిలవచ్చు కదా!" అడిగాను స్నేహపూర్వకంగా.

అతను నిశ్శబ్దంగా రెండు చేతులూ కుర్చీలో ఉంచి తదేకంగా నేలవైపు చూస్తూ ఉన్నాడు.

"ఈ సమస్యని కొంచెం చూద్దాం ఏమంటారు?" అడిగాను.

అతని చేతులు, వేళ్లు విరుచుకున్నాడు. వేళ్లు రెండూ చిందించి తిరిగి వదిలేస్తున్నాడు. విరగని వేళ్లని మళ్లీ విరవటానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఒకప్పుడు మదనపడుతున్న సమస్యని బయటకు లాగి నలుగురిలో చర్చిస్తే అది తనంతట తాను తీరిపోవటానికి గానీ, సులువు అవటానికి గానీ దోహదపడుతుంది!" ఆగి, అతనికేసి వంగి, "నాతో, నా ఒక్కరితో మీ సమస్య చెప్పకూడదూ?" అడిగాను.

రాజగోపాల్ తల ఎత్తి అటూ ఇటూ చూశాడు, ఏదో వెదుకుతున్నట్లు, కళ్లు పైకీ కిందికీ వెతుకుతున్నాయి. పిచ్చివాడా? మతి భ్రమించిందా! నిజమే. సమస్యలని తన లోపలే కొన్నేళ్లుగా ఉంచుకుంటే ఆ వ్యక్తికి మతి భ్రమించడం పరిపాటే! ఆ సమస్యలు లోపలి నుంచే ఇతన్ని ఆ పరిస్థితికి పురికొల్పాయి.

లేచి పక్కన బీర్వాలో దాచుకున్న విస్కీ బాటిల్ తీశాను. రెండు గ్లాసులు తీసి అందులో రెండేసి పెగ్గులు పోసి, సగం నీళ్లు పోశాను.

"తీసుకోండి, మిమ్మల్ని కాస్త రిలాక్స్ చేస్తుంది!"

చేతులు నలుపుకుంటున్నాడు. ఒక్కసారి ఆ గ్లాసువైపు చూశాడు. "నే ... నేను ఎక్కువగా తాగను!" అన్నాడు. అంటూ గ్లాసు తీసి రెండు గుటకలు వేశాడు. "ఎప్పుడూ తాగలేదు కూడా!"

కొంతమంది సమస్యల వలయంలో పడి తాగుడికి దాసోహమైపోతారు. కానీ రాజగోపాల్ ఆ కోవకు చెందినవాడు కాదు. నేనో రెండు గుటకలు నా గ్లాసులోంచి తాగాను.


రాజగోపాల్ తన గ్లాసుకేసి చూసి, సందేహిస్తూ తీసుకుని మరో రెండు గుటకలు తాగి అక్కడ పెట్టాడు.

అదును చూసి, "తల మునిగే సమస్యలను తనొక్కడే మోయాలనుకోవటం కన్నా, నలుగురితో చర్చించి, సమాధానం కనుక్కోవటం చాలా తెలివైన పని!" అన్నాను.

నాకు తెలుసు, కొన్ని కొన్ని సమస్యలు, కొంతమంది పైకి చెప్పుకోటానికి ససేమిరా ఒప్పుకోరు. అది వాళ్ల ఈగోకి సంబంధించిన సమస్య.

"మీ సమస్య మీ వ్యక్తిగతమైనా ... సాధారణంగా పైపైన వాటిని తడుతూ మాట్లాడుతూ ఉంటే, పరిష్కారం వెంటనే తెలియకపోయినా, మార్గాలు సుగమం కావటానికి ఆస్కారం ఉంటుంది!" అన్నాను.

రాజగోపాల్ ఎప్పటిలాగే తల వంచుకుని ఉన్నా కానీ, చేతులు నలుపుకోవటం కొంచెం తగ్గింది. నుదురు మీద మడతలు అతన్ని ఆలోచనలోకి దింపాయనిపిస్తోంది. మెల్లగా తనలో తాను తల



ఊపుకుంటూ "నే... నేను చాలా పిరికివాణ్ణి!" అనగలిగాడు.

ఈ సమాధానం కోసం నేను ఎదురు చూడలేదు. అయినా ఏదో ఒక జవాబు వచ్చిందనిపించింది. కానీ తేలిందేమిటంటే ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో చాలా బాధపడుతున్నాడని. సెల్ఫ్ కాన్ఫిడెన్స్ కరువై, దారుణంగా బాధపడుతున్నాడు. కావలసింది ఈగోని వృద్ధి చేస్తే ఫలితం ఉండవచ్చనిపించింది.

"మనందరం పిరికివాళ్లమే! కానీ పరిస్థితులు వేరువేరు. అంతే!" అని, "ఏదో ఒకదాని గురించి, ఏదో ఫోబియాతో ప్రతివాడూ అనుక్షణం భయపడుతూనే ఉంటాడు. కానీ అందరూ అది బయటకి కనపడనివ్వరు!" అన్నాను. అని, ఒక పది నిముషాలు మనిషి నడవడిక, పరపతి, విలువలు, ఆత్మస్థైర్యం, దాని బలం, తద్వారా వ్యక్తికి లభించే కొత్త వ్యక్తిత్వం... దాని ద్వారా అతని భవిష్యత్తు రూపకల్పన... వీటన్నింటి గురించీ ధారాళంగా, నా అనుభవం అంతా ఉపయోగించి చెప్పి, ఉదాహరణలు నా పాత పేషెంట్ల వివరాలను ఉటంకించాను.

అంతా విని తల ఊపాడు. "మీ మాటల్లో చాలా నిజం ఉంది, సార్!" అన్నాడు.


రాజగోపాల్ చాలా రిలాక్స్ అయ్యాడు. అది చూసి నా ప్రయత్నం ఫలిస్తున్నందుకు ఊపిరిపీల్చుకున్నాను.

"పరిస్థితులు తారుమారయి, తప్పులు కోకొల్లలుగా అవుతున్నా, రెండేళ్ల నుంచీ అలా చూస్తూ ఉండిపోయాను!" ఆగాడు రాజగోపాల్. "ఈవాళ రాత్రి అవన్నీ పతాకస్థాయికి చేరిపోయేదాకా నాకేమీ పట్టలేదు!"

"ఎగ్జాక్ట్‌లీ! మీ కష్టాలని తీసేయటంకన్నా, ఆ పిక్చర్‌లోంచి మిమ్మల్నే ఎలిమినేట్ చేసేసుకోవాలనుకున్నారు!" ఆగాను.

రాజగోపాల్ గ్లాసు తీసి ఒక్క గుటకలో మిగిలిందంతా తాగాడు. ఇదే సరైన సమయమనిపించింది. "మీకు ప్రత్యేకంగా ఇదంటూ ఒక సమస్య ఉంటే చర్చిద్దామా ఒకసారి!" అన్నాను.

తల అడ్డంగా తిప్పాడు. "లేదు లేదు! మీ మాటలు, మీతో సంభాషణ నాకు స్ఫూర్తినిచ్చింది. నాకు మానసికంగా బలాన్నిచ్చింది. నేను అనుకున్నట్లు కాకుండా మరో దృక్కోణంలో సమస్యకు పరిష్కార మార్గం వెదకాలనిపిస్తోంది. నాకున్న సేవింగ్స్ అన్నీ డ్రా చేశాను. నా ఆస్తులన్నీ అమ్మి కాష్ చేసేసుకున్నాను. ఎక్కడికో పారిపోదామనుకున్నాను నిజంగా! అయినా ఈ




సమస్య పరిష్కారం కాకుండా అలాగే ఉంటుందన్న ఆలోచన వచ్చింది. దాని ద్వారా పీడకలలు, మనోవేదన, ఆత్మక్షోభ తప్పవని, చివరికి వేరే గతి కనిపించక ... మీకు తెలుసు కదా ఈ నిర్ణయానికి వచ్చాను" ఆగాడు.

"అన్నింటికన్నా ముఖ్యమైనది ఒక మనిషి తనమీద తనకు నమ్మకం ఏర్పాటు చేసుకోవాలి!" అన్నాను.

ఉన్నట్టుండి రాజగోపాల్ లేచాడు. అతని ఆజానుబాహువు అయిన విగ్రహం గంభీరంగా ఉంది. వచ్చినప్పటి ఆయన విగ్రహం, తీరు ఇప్పటి తీరూ చాలా తేడా ఉంది. కాన్ఫిడెన్స్ ఉంది. పట్టుదల కనిపిస్తోంది. స్థిరత్వం బయటపడుతోంది.

"మీ సాయం ఈ జన్మలో మరువలేను. నేనిలా మారుతానని ఎప్పుడూ ఊహించలేదు!" అంటూ చేయి ముందుకు చాచి "చాలా థాంక్స్! నా భవిష్యత్తును నాక్కావలసిన విధంగా మార్చుకోగలననే విశ్వాసం నాలో కలిగింది!" అన్నాడు.

నేను లేచి నిల్చున్నాను. "మీకేదైనా ఇసుమంతైనా సాయం చేసి ఉండినట్లయితే అదే నాకు పెద్ద బహుమతి!" అని నవ్వుతూ, "ఇక అలాంటి టాంక్‌బండ్లు, బ్రిడ్జిలవైపు వెళ్లకండి!" అన్నాను.

"అబ్బే... అలాంటి సమస్యే లేదు!" అంటూ వెళ్లిపోయాడు పెద్ద పెద్ద అంగలేసుకుంటూ.

సమయం తెల్లవారుజామున మూడయింది. సమయం తెలియలేదు. టైము చూడగానే ఆవలింతలు వస్తున్నాయి. ఫోను తీసి, ఎస్.పి. మాధవ్‌రెడ్డికి కలిపాను. రెండుసార్లు రింగ్ కాగానే ఆయన రెస్పాన్స్ ఇచ్చారు.

"హలో...!"

"క్షమించాలి, నా ప్రయోగం సత్‌ఫలితాలను ఇచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది!" అన్నాను.

"కారుని పంపి అతన్ని పిక్‌అప్ చేసుకోమంటారా?"

"అబ్బే ... అదేం అక్కరలేదు ఆయనే ఇంటికి వెళ్లిపోయాడు!" అన్నాను.

"అలాగా! బాగానే ఉందే! కానీ నాకంతా మొదట్లో మీరేం చేయగలరా అని అనిపించింది సుమా! ఓకే...! ప్రాబ్లెం ఏమీ ఉండదు కదా!" అన్నాడు.

"నేను పర్సనల్‌గా గారంటీ ఇస్తా! టాంక్‌బండ్ ఎక్కడంటే తెలియదంటాడు!" నవ్వుతూ చెప్పి ముగించి ఫోనుపెట్టేశాను.

ఫోను మోగింది. నిద్రలోంచి హఠాత్తుగా లేచాను.

టైము నాలుగున్నర అయింది.

"హలో!" అన్నాను దుప్పటి పూర్తిగా ఒంటిమీదకి లాక్కుంటూ.

"మాధవ్‌రెడ్డి హియర్!" అన్నాడు అవతలి వ్యక్తి.

"చెప్పండి, అప్పుడే నిద్ర లేచిపోయారా?" అడిగాను.

"మీ లెక్చరు, మీ వైద్యం కొంచెం ఎక్కువ పొటెన్సీ ఇచ్చారేమో ... రాజగోపాల్‌కి. ఆయన భార్య మంజులాదేవి, ఆవిడ డ్రైవరు కిరణ్ హిమాయత్‌నగర్ నాలుగో క్రాస్‌రోడ్డు ఇంట్లో దారుణంగా హత్య చేయబడ్డారు. జస్ట్ పదిహేను నిమిషాలయింది ఇది జరిగి! మాకు ఎవరో ఇమ్లిబన్ బస్టాండ్ నుంచి ఫోన్ చేశారు!"

■